# ఏవిఁలోకం! ఏవిఁమనుష్యులు

ఆ యింట్లోకి క్రొత్తగా వచ్చిన తొలినాట రాత్రి వసుంధర అభిమానవతి అని ఋజువు చేసుకుంది. టపటపమని చూరుమీదనుంచి చినుకులు నేలకు చిందుతున్నై. జల్లుకు కిటికీ తట్టున వాల్చిన మంచాన్ని ఇసింటా లాక్కున్న రామేశం చీత్కారం చేశాడు 'నాకు ఏ మాత్రం చప్పుడయినా నిద్రపట్టదు' అంటూ.

అసలు క్రొత్తచోటు కొస్తే నాకు వారం రోజులదాకా కూడా నిద్రపట్టదండీ అందామనుకుంది వసుంధర. అనబోయి ఎందుకులే అని నవ్వేసింది.

ఖాళీ బియ్యపు డబ్బాను బరబరా ఈడ్చుకొచ్చి దాన్ని బోర్లించి తలవాటున దీపం ఎత్తి దాన్ని మీదవుంచి మంచం ఎక్కి కాళ్ళు బారసాచుతున్నాడు అతను.

ఆ డబ్బా గరగరలకు వసుంధర కాస్త ముఖం చిట్లించిందో లేదో నులకమంచంమీది బొంతలోని పిల్లాడు గ్యారుమంటూ ఏడుపుకు లంకించుకున్నాడు.

"ఆ డబ్బా ఎందుకండీ చప్పుడు చేశారు?"

"నేనేం చేశాను? ఆకలయి వాడేడుస్తూంటే-"

"ఆకలయా...ఇప్పుడే కదండీ పాలుపట్టి నిద్రపోగొట్టాను. వాడు మళ్ళీ లేచి కూర్చున్నాడు నా ప్రాణానికి-"

చినుకులు టపటపమంటే నిద్రపోలేని పెద్దమనిషి బియ్యపు డబ్బాను గచ్చునేల మీద ఈడ్చి, ఏడ్చి ఏడ్చి పడుకున్న పిల్లాడ్ని లేవగొట్టే సాకనేరని తల్లికి ఎంత విసుగుపాటో అంతా వసుంధర ముఖంలో ప్రతిబింబించింది.

బ్రతుకంతా మారి చదువంతా వ్యర్థమయి ఆశలన్నీ ఒక్కటొక్కటే ముసుగేసుకు చీకటి తెరల్లోంచి జీవితాన్ని పరిహసిస్తూంటే; పొట్టకోసం పగులల్లా రెక్కలు కొట్టుకు వచ్చాక రాత్రి పడుకోబోయే-ముందైనా సంస్కారం చావనందున ఏదన్నా మంచి పుస్తకం తెచ్చి

ఒక గంట చదివి ఆనందిద్దామంటే పెళ్ళాం ముఖం ముడుచుకుంటుందిగదా. దీని దుంపతెగ ఈ మగవాళ్ళ కోర్కెలు ఆశలు ఆడవాళ్ళ కర్థమయే దెలాగ?

మన ఆడవాళ్ళకు 'కల్చర్' లేదు అని పెదవి విరిచాడు రామేశం. 'ఈ మగవాళ్ళకు జాలి అంతః కరణ దయ అన్నవి ఉండవు కాబోలు' అనుకుంది వసుంధర.

ఒక్కర్తినీ ఇంటెడు చాకిరీ చేసుకున్నాను. బట్టలన్నీ ఉతుక్కుని వానలో ఆరవని యింట్లో త్రాళ్ళు కట్టి ఆరేశాను. క్రొత్తయిల్లూ కాపరం గదా సామానంతా రెక్కలు ముక్కలయేలా సర్దీతుడిచీ కడిగి రోజల్లా కొట్టుకు కొట్టుకు చచ్చాను. ఇప్పుడే నిద్రపోయే కుంకను కాస్తా లేవగొట్టారు. ఈ మాత్రం కనికరం నేర్చుకోకపోయాక ఎందుకా పుస్తకాలు చదవటం అనుకుంది వసుంధర పిల్లవాడికి పాలు కుడుపుతూ.

బ్రతకటం నిద్రపోవటానికా చివాట్లతో నవుకరీచేసి నాలుగురాళ్ళు తెచ్చుకోటానికేనా మరి పిల్లల్ను కని యీ ఝుంఝూటంలో కఫంలో పడ్డ ఈగలా కొట్టుకోవటమేనా అని చర్చించుకుంటున్నాడు రామేశం.

ఒక మీసాల గండుపిల్లి ఎలికను తరుముకొచ్చి పైనుంచి సరాసరి రామేశం హరికేన్ లాంతరు ఉంచిన డబ్బా మీదకురకటంవల్ల ఒక చేయి తలకు ఆన్చి మగతలోపడ్డ వసుంధర 'బాబోయ్' అని ఉలిక్కిపడింది. పాలు త్రాగుతూ నిద్రపోయిన పిల్లాడును మరోసారి కెవ్వుమన్నాక గుండెలకు హత్తుకుని 'ఇంకా ఏవిటీ అఘాయిత్యం మీరూను' అనేలా విసుక్కునే భంగిమను ప్రదర్శించింది కాస్త.

రామేశం చప్పున పుస్తకం మూసి మంచంమీదనుంచి లాంతరును అందుకో బోతున్నాడు.

పొరుగున మర్యాదస్తుడైన ఆసామీ కంఠం 'ఎవరో అడివిమనుష్యుల్లాగున్నారే–' అనగా మరొక స్త్రీ కంఠం ఫామేదగా 'బాగుండదు మీరూరుకోండి మన కెందుకు–' అని కలుపుకొచ్చింది.

రామేశం ముఖం కందగడ్డలా అయి ముక్కు నలుపుకొంటున్నాడు.

వసుంధర భయంతో భర్త ముఖంలోకి చూసింది. నిద్రపట్టకో దోమల బాధకో మంచం కుక్కిలోని పిల్లాడు బారుమని గొంతెత్తాడు. అక్కసంతా తీరేలా వసుంధర వాడ్ని కుదిపి గుంజి 'ముష్టివెధవసంత' అని తిట్టుకుంది.

చినుకులు యథావిధిని టప్పుటప్పుమని చిందుతున్నా రామేశం నిద్రపోయాడు. దోమలు కుడుతున్నా డొక్కలోని పిల్లాడిమీద గాజుల చేతులు కప్పి నులకమంచం కుక్కిలో హాయిగా తొలికూడి కూసేదాకా వసుంధర బండనిద్రపోయింది.

ఉదయం అణాపెట్టి కొని తెచ్చుకున్న ఆంధ్రపత్రికలోని మధ్య పేజీ చదవటానికిమ్మని రామేశం దగ్గర అడిగి పుచ్చుకున్నాడు పొరుగు పెద్ద మనిషి. రాత్రి అడివి మనుష్యులన్నమాట రామేశానికి గుర్తుకురాలేదు.

దొడ్డిలో తడిసిన చీర పైకి ఎగగట్టుకుని మోకాళ్ళమీద చంటిపిల్లాడ్ని బోర్ల పడుకోబెట్టుకుని నీళ్ళుపోస్తున్న వసుంధర తువ్వాలు తెమ్మని భర్తకు పురమాయించింది. రామేశం తువ్వాలుతో వస్తూండగా శతమతమయి ఉడుకునీళ్ళలో నానిన కుర్రకుంకను రెండుచేతులా యెత్తి గుండెలకు హత్తుకుని వస్తూన్న వసుంధరను చూసిన పొరుగావిడ డాబా మెట్లవద్ద ఆశ్చర్యంగా నిలబడిపోయి, 'అయ్యో పెద్దవాళ్లెవరూ లేరా అమ్మా చంటి బిడ్డకు నీళ్లుపోసేందుకు....నా తెలివి కాలిపోను-నన్నన్నా పిలిచావు కాదేవమ్మా-ఎంతపని ఒక్క నిముషం-అయ్యో నానిపోతాడు చప్పున తుడిచి సాంబ్రాణి పొగవెయ్యి అమ్మాయీ' అంటూ ఆవిడ బట్టలు ఆరవేసుకోవటానికి పైకి వెళ్లిపోయింది.

లోకంలో ఎంత మంచివాళ్లు ఉంటారు? అని అనుకుంది వసుంధర.

అప్పటికి సూర్యుడు కాస్త ముఖం చూపించాడు. వాననీరు అక్కడా అక్కడా పడినచోట తన తాత బంగారు హస్తాలతో తళుక్కు తళుక్కుమనేలా భూదేవికి ముస్తాబు పూర్తి కావిస్తున్నాడు. దూరాన చెట్లమీది గూళ్ళలో తడిసిన పక్షులు వానకోట్లమీద నీరును దులుపుకొన్నట్లుగా రెక్కలలార్చుకుంటున్నై. ఆకాశంలో మబ్బులు యుద్ధానంతరం ఇళ్ళకు మరలే సైనిక సమూహాల సంచలనాన్ని పోలినట్లు తిరుగుముఖం పట్టినై.

రామేశం కాఫీ కప్పును పెదిమలకు తాటిస్తూండగా-కుంపటివద్ద కూర్చుని రేగిన జుత్తును పైకి త్రోసుకుంటూ 'మన పొరుగావిడ పాపం ఎంత కలుపుగోరు మనిషండీ..' అన్న అభిప్రాయాన్ని వెళ్ళబెట్టింది వసుంధర.

ఆ అమ్మాయి ముఖంలోని ప్రశాంతత రామేశాన్ని కొద్దిగా ఆకర్షించింది.

"పదిగంటలకి ఖానా తయ్యారుగా వుండాలి సుమా! మా ఆఫీసరు పదిన్నర కాగానే హాజరు పుస్తకం తనగదిలో పెట్టుక్కూర్చుంటాడు."

ఈ ముక్కల్ని విననట్టుగానే వసుంధర ఆలోచించుకుంటున్నది. పొరుగింటావిడ బొద్దుగా పొట్టిగా మహాలక్ష్మి కళ ఉట్టిపడుతూవుంటుంది. అస్తమానూ స్నానాలు చేయటం వలన బిరుసెక్కినా, కొంతవరకు నెరసిన తలతో పచ్చటి ముడతలు తేరిన ముఖం పెద్ద అర్ధణా కాసంత కుంకుమ బొట్టుతో తడిసిన చీర బుజాన్న మడిబట్టలతో ఆవిడ రూపం మహా ఆప్యాయంతో మనఃఫలకం మీద చిత్రించుకుంటోంది.

ఆ ఇంటికీ ఈ ఇంటికీ నడుమగోడ-మనుష్యులు ఇళ్లకూ ఇళ్లకూ నడుమగోడల్ని ఎందుకు కట్టుకుంటారో-బహుశా ఒకరిమీద ఒకరికి నమ్మకం లేక గావాల్ను....

డబ్బాపాలతో కాచియిచ్చిన కాఫీ గొంతుకలో పోసుకున్నాక రామేశం తువ్వాలు బుజంమీద వేసుకుని నెమ్మదిగా వీధిలోకి జారుకునే యత్నంలో వున్నాడు.

"ఏవండీ-ఇదిగో మిమ్మల్నే ఆ రైలుదగ్గరకో ఎక్కడికో పోయి ఒక బేడ పెరుగు పోయించుకురారాదూ?"

"మంచివాళ్ళేగా-పొరుగావిడతో చెప్పు. వాళ్ళయింటికి వచ్చినపుడు నువ్వుకూడా పోయించుకుందువు గాని."

వసుంధర ఊరిమీదకు పోతున్న అతడ్ని వుద్దేశించి "ఇదిగో-మజ్జిగ లేకుండా పెట్టానని నన్నేమీ అనక్కర్లేదు. తర్వాత మీ ఇష్టం...' రామేశం "అరె బాప్రే...ఈ పెళ్ళిచేసుకోవటం ఒక హెవీ బ్లండర్....అస్తమానూ కొంగున ముడేసుకుని త్రిప్పుకోవాలని ఇంట్లో ఆడదీ, యిరవైనాలుగ్గంటలూ చాకిరీచేయించుకుని అరగతీద్దామని ఉద్యోగమిచ్చిన వాళ్లూ-యీ మగబ్రతుకు ఇంత నీచమైన బానిసత్వంగా మారిపోతూంటే-ఈ కాలేజీ అమ్మాయిలు స్వేచ్ఛాజీవులని మగవాళ్ళను చూసి ద్వేషిస్తూంటారు ఎందువల్ల?" అనుకొంటూ జారుకున్నాడు.

పెరుగు విషయం చెప్పాలని అడ్డుగోడవద్ద వసుంధర తచ్చాడుతోంది.

"మీ ముఖం చూసి యిన్నాళ్ళమట్టీ ఆగాను గాని వరలక్ష్మమ్మగారూ-ఒకటా రెండా నాలుగువందలు వెచ్చంకొట్లో బాకీ పెట్టుకుని ఒక్క కానీ అన్నా చెల్లుబెట్టారా? అన్నారంటారు గాని యేం కర్చులు మీరు మానుకుంటున్నారమ్మా-నెలనెలా చీరెలు కొంటూనే ఉంటారు. మళ్ళీ మీ అబ్బాయిలు జట్కాలమీద తిరుగుతూనే ఉంటారు. మధ్యన నేనెందుకు నష్టబోవాలీ అంట-"

ఆవిడపేరు వరలక్ష్మమ్మ గారు కాబోలు-నెమ్మదిగా అంటోంది.

"ఏం నాయనా-తెచ్చుకున్నాక నాలుగువందలైనా వేలైనా ఇచ్చుకుంటాం కాని మానుకుంటామా? పెద్దబ్బాయి బ్యాంకులో పనిచేస్తున్నాడా? వాడిజీతం తెచ్చి సగం యింట్లో ఇస్తాడు. సగం పెళ్ళాం చేతుల్లో పోస్తాడు. ఆవిడగారు ఖర్చు చేసుకుంటుంది లేదా నగలు చేయించుకుంటుంది. ఒద్దు బాబూ మనకీ గొప్పవాళ్ళం అనుకునేవాళ్ళ సంబంధాలు అంటే అప్పట్లో మీబాబు విన్నారా? ఆవిడకు నగలు పెట్టలేదు అందుకని నెలనెలావాడి జీతంలో సగం పుచ్చుకుని పెట్టెలో దాచుకుంటుందో, కన్న వారికే పంపిస్తుందో... కడుపుచించుకుంటే ఛీ కాళ్ళమీద పడుతుంది అల్లూడూ కూతురూ వచ్చారా? వాళ్ళకేమీ లేక కాదు-నెల్లాళ్లుంటారు ఇదీ పరిస్థితి-అమ్మాయికి మళ్ళీయే డోనెల....అయ్యగారు ఆఫీసునుంచి రావటమే క్లబ్బులోపోయి కూర్చుంటారు. ఇల్లుగొడవ ఉంటున్నారా తింటున్నారా ఆయనకు పట్టదు. పిల్లల కాలేజీ జీతాలు-నీ కివన్నీ ఎందుకు చెప్పానంటే నిన్ను గోచీ పెట్టుకునే వయసప్పట్నుంచీ యెరుగుదును కనుక. నా పిల్లల్లాటి వాడివనీ-"

"నే నాగాను కాని యిక మరి ఆగలేనండీ అమ్మగారూ? మీ ఖర్చులూ వ్యవహారాలు ఎప్పుడూ ఇలా వుండేవేగానండి-ప్రస్తుతానికి రెండువందలన్నా సర్దకపోతే నా వల్ల గాదండీ."

వసుంధర పాపం ఆవిడ మనస్సెంత క్షోభిస్తుందోనని గిలగిల్లాడింది ఇవతల్నుంచి.

ఆవిడే అంది-"సరి. వున్న పరిస్థితి యిది నాయనా-నువ్వు పీకమీద కూర్చున్నా కానీ ఇప్పుడు సర్దలేను-కాదన్నావూ-ఇదుగో ఇంద ఈ మెడలోని గొలుసు తీసిఇచ్చేస్తాను-పట్టుకుపోయి నీ సొమ్ము తీసుకుని తతిమ్మాది ఇచ్చెయ్యి, అభిమానం నీ కన్నా వుండాలి నా కన్నా వుండాలి."

వసుంధర గుండె ఝల్లుమంది. "కష్టాలు ఎంత మంచివాళ్ళకైనా వస్తాయి పాపం!" అనుకొంటోంది.

"పోనీలెండమ్మగారూ-మీ మెడలోని గొలుసుతీసి ఇచ్చెయ్యమన్నానా? నాకూ చేతిలో రొక్కం లేక ఇరకాటమై పోయిందని గట్టిగా అడిగాను కాని-మీ దయవచ్చినప్పుడు ఇవ్వండి".

"కాదు పట్టికెళ్లు నాయనా-"

అవతల మనిషి జారుకున్నట్లు జోళ్ళ చప్పుడువలన గ్రహించుకుంది.

"ఏవండీ అత్తగారూ పీడ విరగడైనట్లేనా? అయ్యో ఏమండీ ఎందుకా మెళ్ళో గొలుసు చేత్తో పట్టుకు నిల్చున్నారు?" కోడలు కాబోలు అడుగుతోంది.

మరొకవైపు నుంచి "ఏవే అమ్మా ఐదురూపాయలుంటేఇవ్వవే-మీ అల్లుడుగారు బజారు వెళ్లుతున్నారు. వాళ్లసుశీల మొన్న పేరంటానికి తొడుక్కొచ్చింది. అదేమోస్తరు సరిగంచు రవికలగుడ్డ తెచ్చిబెడతారు" అనగా-

"అల్లాగేనమ్మా-తమ్ముడిచేత కాలేజీనుంచి వచ్చేటప్పుడు తెమ్మనమంటాను. అతడికెందుకీ శ్రమ-"

ఆ తరువాత ఐదునిముషాలకు అల్లుడు కాబోలు.

"ఏవే ఐదురూపాయలుచ్చుకున్నావా? ముందు నా చేత గుడ్డ తెప్పించేశావు పీకలమీద కూర్చుని-"

"మా తమ్ముడి చేతికిచ్చి గుడ్డ తెప్పిస్తానందండి."

"కొంప దిశావే-అనుకుంటున్నాను నాకెల్లాగూ క్షవరం తప్పదని. వెధవ గుడ్డెవరిక్కావాలి, నా ఐదురూపాయలు నాక్కావాలి గాని."

"వెధవబోడి-అనకండి-నా కసలే ఒళ్ళు మండుతుంది. మా అమ్మ నడుగుతాను మీరు ఐదురూపాయలిమ్మన్నారని."

"ఛీ నోర్ముయ్" గోడపక్క సందులో తిరిగి నిశ్శబ్దం ఆవరించుకుంది. కాస్త, ఆలోచించి నెమ్మదిగా "దొడ్డమ్మగారూ." అంది ఇవతల్నుంచి.

"అమ్మా ఎవరో పిలుస్తున్నారే?" కొడుకుగావల్ను. వసుంధర నాలికకర్చుకుంది. "ఏవమ్మా పిలిచావాతల్లీ..." ఆవిడ ప్రసన్నమైన ముఖంతో మెట్లు ఎక్కుతూ గోడమీద చేతులాన్చి అడుగుతోంది.

"పెరుగుమనిషి వచ్చాడేమో మాకుకూడా పోయించి పెడ్తారనీ..."

""అయ్యో నా తల్లీ! వాడప్పుడే పోసి వెళ్లిపోయాడమ్మా ఐతేయేంలే వుందు" అని ఆవిడ లోనికి వెళ్ళి కప్పునిండుగా పెరుగు పోసుకొచ్చి, యింద అమ్మా, సాయంత్రం నవుకరుకుర్రాడ్ని పిలిచి కబురంపిస్తాను."

"అయ్యో ఒద్దండీ ఎందుకు? మీ ఇంటినిండా పిల్లలూ అదీనూ".

"వెధవసంత కాసినినీళ్లు కలిపి ఇంతవుప్పు పడేస్తే మజ్జిగలు పోసుకుపోతారు. తీసుకోఅమ్మా!"

వసుంధరకు ఉట్టినే తీసుకోవటం అభిమానంగావున్నా గత్యంతరం లేకపోయింది.

గోడ అవతల కొడుకు కాబోలు "నా సైకిలుకు ట్యూబు చిరిగి పోయింది. మరోటి క్రొత్తది వేయించుకోవాలి. కాలేజీకి నడిచిపోలేనమ్మా"

"ఎంత అవుతుంది?"

"నాలుగు రూపాయలు."

"రేపు చూస్తాను. నా బాబువుకదూ యిదుగో యీ రూపాయి తీసుకుని రిక్షాచేయించుకు వెళ్ళు."

"ఐతే తమ్ముడ్ని కూడా హైస్కూలు దగ్గర దిగబెడ్తాను. మరో పావలా యివ్వు."

ఆవిడ చీరకొంగు ముడివిప్పి చిల్లరడబ్బులు కొడుకుచేతుల్లో పోస్తూ అంది. "వీళ్ల చదువుకుని ఉద్యోగాలు చేసి నన్ను అందలాన కూర్చోపెడ్తారనా-వెధవ పిల్లలు వాళ్ళ మానాన్న వాళ్ళ బ్రతుకులు వాళ్ళు బ్రతికితే చాలు. మాకా-బ్రతికిననన్నాళ్లు ఇక బ్రతకంగదా-" కొడుకు విసుక్కుంటూ అంటున్నాడు. "వూరికే తెగ వాగుతావే అమ్మా అనవసరపు వాగుడు.'

ఆవిడ గోడదగ్గర మెట్లమీదనుంచి దిగిపోతూ "మధ్యాహ్నం ఒక మాటు మా యింటికి రా తల్లీ! ఇంట్లో ఎవరూ మగవాళ్లు ఉండరు."

"అల్లాగేనండి" అని వసుంధర కప్పుగిన్నె ఇంట్లో పెట్టడానికి వెళ్ళి పోయింది. మళ్ళీ పిల్లవాడి గుడ్డల్ను పంపుదగ్గర ఝాడిస్తుండగా కొడుకులు కాబోలు సందులో చేరి, "ఏమిరా అమ్మ యేమంది?"

"రూపాయే యిచ్చిందిరా-"

"నువ్వేం చెప్పావ్?"

"సైకిలు ట్యూబు పోయిందని-"

"రిక్షామీద వెళ్ళమంది, నాలుగు రూపాయలిస్తుందనుకున్నాను."

"అసలది మనకేదన్నా ఇవ్వాలంటే చస్తుందిరా. చూడు బావ-అక్క యేది కోరితే అది అప్పన్నా చేసి తెప్పించి పెడ్తుంది. మనం మొగపిల్లల మంటే గిట్టదురా. చూడు ఆడముండలను తెగమేపుతుంది."

"పోరా కాలేజీకి ఎవడు పోతాడు-మార్నింగు షో మంచి పిక్చరుంది. బాబ్‌హోప్, లారెల్ హార్డీను."

ఛీ! కన్నపిల్లలే ఇంత విశ్వాసహీనంగా సంచరిస్తారా? వసుంధరకు లోపల్నుంచి దేవేసినట్లుగా అయింది. భోజనాల దగ్గర రామేశం అడిగాడు.

"ప్రతి స్వల్ప విషయానికీ చూడండీ-ఇదిగో అంటూ మొగుడి పీకల మీద కూర్చోకుండా స్వతంత్రంగా నిర్వహించే నేర్పు సంపాదించుకోవాలి".

"ఊహూఁ" అంటూ వసుంధర మూతి బిడాయించింది.

"చూడు అయ్యంగారు అరవ ఆఫీసరి భార్యలు-బెంగుళూరు సిల్కు చీరలు పెళ పెళమనేలా మార్కెట్లలోనూ, అన్ని దుకాణాల్లోనూ వాళ్లే. స్వయంగా బజారు చేసుకుంటారు."

"................."

"వెనకో ఆఫీసరుండేవాడు మాకు. ఆయన భార్య బియ్యేలే. ఆవిడ బంగాళాలో కుర్చీ వేయించుకుని ఆఫీసుకు జవాన్లను పరుగెత్తించేది-ఫలానా గుమాస్తానడిగి ఫలానా ఫైలు పట్రా అంటూ. అన్ని ఫైల్సూ తనముందు పెట్టుకుని పార్టీలకు కబురుచేసి "చూడండీ, మీ అయ్యగారికి సంసారం, పిల్లలూ పెళ్లిళ్ల ప్రసక్తి అక్కర్లేదు" అంటూ రెండు వ్రేళ్ళ దగ్గర్నుంచి నాలుగు ఐదు వ్రేళ్ళవరకూ చూపించి నవ్వేది. స్వయంగా కమ్మటి కాఫీ కలుపుకొచ్చి గాజుల చేత్తో షావుకార్లకు అందిచ్చేది. అమ్మగారు యేమడిగితే కాదనగలరు? బట్టలు అన్ని వస్తువులకు కంట్రోలు యుద్ధం పుణ్యాన-ముడుపులు చెల్లిస్తే ఆర్డర్లు ముచ్చటగా వేసేసేది. క్లబ్బుకు పంపించి అయ్యంగారి దోభీమార్కు వేయించేసి షావుకార్లను పెర్మిట్లతో సాగనంపేది. ఇంతకూపాపం గుమాస్తాల నోట్లో కరక్కాయే."

"ఐతే మరి మీరుకూడా కాగితాలు ఇంటికి పట్టుకురండి, రేపట్నుంటి-" వసుంధర ముసిముసిగా నవ్వటంతో రామేశం ధోరణి తగ్గించి, "అహఁ, లోకంతీరు ఎట్లా వుంటుందో తెలియచెప్పటం కోసం అన్నాను గాని-".

ఇద్దరి నవ్వులూ మిళితమై ఆ వంటయింట్లోంచి కిలకిలలు, ఒక్కుమ్మడిని వాతావరణాన్నే మారుస్తూండగా-

"మెంతిమజ్జిగ పోసుకోరూ-" అతడు కడుపు చేత్తో పుచ్చుకుని చేతినాడిస్తూ "అబ్బ-యిక వొద్దే. మజ్జిగ పోసెయ్యి, నీకు పుణ్యముంటుంది".

"కడుపునిండా తినండి. మళ్ళీ సాయంత్రం ఆరు కొట్టేదాకా చాకిరీ చెయ్యాలా-"

"ఇంత మరీ ఎక్కువైతే ఆదరణ కడుపు పగిలి చస్తాను."

"పొండి అవేం మాటలండీ!"

రామేశం హాస్యంగా "ఒక్క సత్యం చెబుతాను, నువ్వేమీ అనుకోకు. ఆ మూల

ఎక్కణ్నుంచో నువ్వు, యిటు మరో మూలనుంచి నేనూ ఇద్దరం కలిశామా, కొన్నాళ్లు మనం గౌరవంగా స్నేహంగా లోకయాత్ర చేశాక నెమ్మదిగా మళ్లా విడిపోయి ఎక్కడికో నువ్వో చోటికీ నేనో చోటుకీ... ఈ మాత్రానికి అనవసరంగా మమకారాలు పెంచుకోవటం ఉందీ..."

"వొద్దుగాని మీకు పుణ్యముంటుంది. మజ్జిగ పోసుకుని ముందిక్కణ్నుంచి లేవండి."

వసుంధర వంటయింటి గుమ్మందాటి ఎదురుగా దండాన గాలికి ఎగిరి నేలమీద పడ్డ తువ్వాలను దులిపి తిరిగి ఆరవేస్తూ భర్త నుద్దేశించి-

"నేనేమి ఇవ్వాళే కళ్లువిప్పి యీ ప్రపంచాన్ని మనుషుల్ని చూస్తున్నా ననుకుంటున్నారా."

కంచంలో చేతులు కడుగుతున్న రామేశం-

"లేదు. అబ్బో నువ్వెక్కడ? నువ్వు తల్లి కడుపులోంచే ప్రపంచాన్ని చూడ్డం నేర్చుకున్నావు? అంటూ లేచాడు పీటమీదనుంచి.

మధ్యాహ్నం నడవలో కూర్చుని తీరిగ్గా ఆలోచించుకో సాగింది వసుంధర. అంతక్రితమే పొరుగువారియింట్లో స్కూళ్లకుపోయే పిల్లలు ఆఫీసులకు వెళ్లేవాళ్లు అంతా వెళ్ళిపోయారు. పదకొండు గంటలప్పుడు కాబోలు ఆ యింటి యజమాని క్లబ్బు నుంచి వచ్చి విస్తరిదగ్గర పెద్ద గలాటా చేసి ఆవిడకు శాపనార్థాలు పెట్టి మరీ లేచాడు. పోపు మాడపెట్టినట్లుందిట. నిన్నచేసిన కూరే ఇవ్వాళా చేసిందట. బియ్యంలో ఒక రాయి వుందట. ఇంకేం కావాలి? 'ముండ-' అనటం వరకూ కూడా 'వసుంధర విన్నే వింది. తరువాత వరలక్ష్మమ్మగారు అడుగుతోంది, "కాస్త వెళ్ళి డాక్టర్ను పిల్చుకురారాదూ?"

"వాడే ఒస్తాడుగా-"

"రాలేదండీ-మర్చిపోయాడు గావాల్ను."

తరువాత ఆవిడ బ్రతిమాలినా ఆయన యింట్లో నుంచిససేమిరా కదల్లేదు. చివరకు ఆవిడే "నేనే వెళ్ళివస్తాను" అంటూ బయల్దేరింది. తరువాత డాక్టరును ఆవిడే పిల్చుకొచ్చింది. వసుంధరకు తెలిసింది ఏమంటే ఇందాక తాను డాక్టరువద్దకు వెళతానని అన్న ఆ ఇంటి యజమాని మంచంలో పడివున్న పధ్నాలుగేళ్ళ పెళ్ళీడు టైఫాయిడ్ పిల్లకు తండ్రే అని.

పధ్నాలుగేళ్ళ పెళ్ళీడు పిల్ల మంచంలో టైఫాయిడ్‌తో వుంటే, పోపు మాడిందని ఆ ఇల్లాలును 'ముండ' అన్న మనిషికి, తండ్రిగదా పిల్ల మీద ప్రేమ యెందుకు లేదు? ప్రశ్నించుకుంటోంది-వసుంధర.

ఈ ప్రపంచాన్ని మనుషుల్ని ఇన్నేళ్ళబట్టీ చూస్తున్నా వసుంధరకు ఇవ్వాళ కనుపించినట్లు ఇంతకుముందెప్పుడూ ఇంత నగ్నంగా గోచరించినట్లు లేదు.

ఈ విశాలలోకం ఒక భయంకరమైన రాక్షసమూర్తిని దాల్చినట్లు తామేమీ చిటికిన వ్రేళ్లలా అయి నిలబడి చూస్తున్నట్లుగా వసుంధర వూహించుకుంది.

"ఏవమ్మోయ్–"

వసుంధర తలెత్తింది. ఎదురుగుండా వరలక్ష్మమ్మగారు నవ్వుతోంది. ఆవిడ ఎట్లా నవ్వగలుగుతోంది? బడబానలాన్ని కడుపులో పెట్టుకుని కూడా సముద్రుడు ఎంతో హుషారుగా వున్నట్లు కనుపిస్తాడు. కష్టాలు వచ్చినప్పుడు 'అలోలక్ష్మణా' యని ఏడ్చే మనుషులను చాలామందిని చూసింది గాని ఆ దొంతరలమధ్య నవ్వే మనుషులు ఎట్లాటివారో ఆమె ఇప్పుడిప్పుడే కళ్లువిచ్చి చూస్తోన్నట్లుంది.

"రండి లోపలికి వచ్చి కూర్చోండి."

వసుంధర లేచి చాపతెచ్చి పరుస్తూండగా–

"మధ్యాహ్నం కాస్సేపువచ్చి కూర్చోమన్నానుగా తల్లీ! మర్చిపోయావా–" ఎంత తియ్యగా మాట్లాడుతోంది ఈవిడ?

"లేదండీ?" నవ్వేసింది.

"పిల్లవాడేం చేస్తున్నట్లు–?"

లేచివెళ్ళి మంచంలోని కుర్రకుంకను తెచ్చి ఆవిడ చేతుల్లో పెట్టింది.

"నీ పోలికా, మీ ఆయన పోలికా?"

"ఏమోనండీ!"

"అదేం! ఆ ముక్కూ చిన్ననోరూ అంతా నీ పోలికేనమ్మా. అదృష్టవంతురాలివి. తల్లిని సుఖపెడ్తాడులే కొడుకు."

ఈమాట కొంచెం వెగటుగా వినిపించి కుర్రాడి ముఖంలోకి చూసింది. వాడును గుప్పిట్లు బిగించి చేతులూపుతూ అమాయకంగా నవ్వుతున్నాడు.

"మీ పిల్లకెల్లా ఉన్నదండీ వంట్లో–"

"రామ్మా చూద్దుగాని."

వసుంధరకు ఆ యిల్లూ అందులోని మనుషుల్ని దగ్గరనుంచి చూడాలనే కోరిక కలిగింది. ఆవిడే స్వయంగా లోపలకు తీసుకువెళ్ళి చూపెడుతోంది. ఒకవైపు గదిలోనుంచి వొక 'తెల్లటి నాజూకైన మనిషి కాబూలీ దానిమ్మపండు విరిచి చేత్తో పుచ్చుకుని గింజల్ను నములూ్త ఒక్కమాటు ఈవలకు తొంగిచూసి మళ్ళీ లోనికి వెళ్ళిపోయింది.

"ఈ ఇంటికి పెద్దకోడలమ్మాయి–కాస్తంత బలహీనపు మనిషి–నెత్తురు తక్కువని కాబూలీ దానిమ్మపండ్లు తినమని దాని మొగుడు తెచ్చి ఇస్తూంటాడు."

ఆవిడ పెద్దాపురం పట్టుచీర కట్టుకుంది ఇంట్లో తిరగటానికి కూడా. "నువ్వు ఇంటరుమేటు దాకన్నా చదువుకున్నావా?"

"అయ్యో నా బొంద, నాకేమీ రాదండీ" అంది వసుంధర.

"ఆవిడ చదువుకుందిలే–" వరలక్ష్మమ్మగారు కాస్తంత నవ్వింది. దారిలో ఆవిడ

పెద్దమ్మాయిని చూపెట్టింది. వెళ్లేసరికి ఆవిడ పన్నెండేళ్ళ కొడుకును చేంతాడుతో దండిస్తోంది. ఆ కుర్రాడు నల్లటిచొక్కాతో చూడముద్దుగా వున్నాడు. మమ్మల్ని చూడగానే చప్పున సిగ్గుపడి తల్లికి చేతులడ్డంపెట్టాడు. వరలక్ష్మమ్మగారు అడ్డువెళ్ళి "యేం వెధవపనే--" పిల్లాణ్ని దగ్గరకు తీసింది.

"ఇదిగో నీవే-నీ మూలకంగానే ఈ ఇంట్లోని సగం పిల్లలు పూర్తిగా పాడైపోతున్నారు. ఎక్కడేనా ముద్దుగాని-"

"ఏం వాడిప్పుడేం చేశాడే?"

"వాళ్ళ నాన్నగారి జేబులో ఐదు రూపాయల కాగితం తీసికెళ్ళి" ప్రక్కన మరోమనిషి వుండటాన సంకోచిస్తూ "ముష్టివెధవ లందరితో చేరి బీడీలుకూడా త్రాగుతున్నాట్ట" అంది కూతురు.

"ఏంవే మీ ఆయన చెరిసగానికి సగం ఆస్తి దూబరా చేశాట్టగదా? ఆమాటెందుకులే ఇప్పుడు-కాని అతనూ సిగరెట్లు కాలుస్తాడుగా. ఈ చేంతాడుతో అతణ్ని కూడా-నీకు కాస్త పుణ్యముంటుంది." వసుంధర ఫక్కుమని నవ్వేసింది.

"అదికాదమ్మా-ముక్కూ మొహం తెలీని పసికుర్రాణ్ణి పట్టుకుని దండించేకంటే అంతకన్నా పెద్దతప్పులు చేసినవాళ్లను ఒదిలెయ్యటం యేం న్యాయమంటాను? నేరానికి శిక్ష విధించేప్పుడు తల్లీ, బిడ్డా, తండ్రీ, భర్త ఎవడైనా ఒకటేనే అమ్మాయీ-"

"అందులో రెండు మూడు రూపాయలు ఎవడికో అప్పుకూడా ఇచ్చాడట కూడాను."

"ఇంకేం-నా దొరబాబు అప్పులిచ్చి సాయం చేయటం కూడా నేర్చుకున్నాడు గావాల్ను."

వరలక్ష్మమ్మగారూ వసుంధర ఆ కుర్రాడూ ముగ్గురూ టైఫాయిడ్ పిల్లవున్న గదిలోనికి వెళ్లారు. ఆ గదిలోనికి అడుగుపెట్టాక వరలక్ష్మమ్మగారి ముఖం మారిపోయింది. అంతవరకూ నవ్వుతూ వేళాకోళంగా మాట్లాడిన మనిషి చప్పున దిగజారిపోవటం స్పష్టంగా ముఖంలో గోచరిస్తోంది.

ఆ పిల్ల చాలా నీరసంగా వుంది. దవడలు లోపలికి పోయాయి. ముఖం కాస్తంత ఎర్రగా వుంది. ఒకప్పుడు ఆ అమ్మాయి ఎట్లా వుండేదో యీ మంచాన్ని అంటిపెట్టుకున్న పిల్లను చూసిన వసుంధర ఇప్పుడు వూహించటం చాలా కష్టం.

ముగ్గురూ మౌనంగా ఆ గదిలో కాస్సేపు కూర్చున్నాక-

"బత్తాయిపండు తినాలనుందే-" అంది ఆ జ్వరంపిల్ల. వరలక్ష్మమ్మ గారు అకస్మాత్తుగా తెల్లబడిపోయిన ముఖంతో-"ఇప్పుడెల్లాగ తల్లీ-సాయంత్రం తెప్పిస్తాను. బజారు వెళ్ళేందుకు ఇంట్లో ఎవ్వరూ లేరుకూడా."

డాక్టరు కోసం స్వయంగా వెళ్ళిన ఈమె ఎందుకు పండుకోసం వెళ్ళటానికి సందేహిస్తోందో అనుకుంది వసుంధర.

ఆ పన్నెండేళ్ళ కుర్రాడు చట్టున లేచి నిల్చున్నాడు. 'నేను వెళ్తానుగా అమ్మమ్మా.'

ఆవిడ కళ్లల్లో నీళ్లు తిరగడం చూసి అంత మంచిమనిషికూడా పాపం ఏడుస్తోంది అనుకుని వసుంధర 'ఏమండీ దొడ్డమ్మగారూ కంగారుపడకండి. మీ అమ్మాయికేం ఫరవాలేదు. నమ్ముకున్నవాళ్ళకి దేవుడు ఎప్పుడూ అన్యాయం చెయ్యడు.'

ఆవిడచెంగుతో కళ్ళు ఒత్తుకుంటూ 'చిల్లరడబ్బులు లేవు బాబూ' దగ్గర అంటూంటే యీ భూమి బ్రద్దలయిపోదా ఆవిడకష్టంగా ఒక్కమాట పైకి అనుకుంటే అనిపించింది వసుంధరకి. పోనీలెండి నేను ఇస్తాను అని అనే ధైర్యం ఎంత గింజుకున్నా వసుంధరకు రాలేదు.

"నువ్వూరికే ఎందుకే అమ్మమ్మా యేదుస్తావు-' నేను పట్టుకొస్తాగా పిన్నికి బత్తాయి పళ్లు-" అనేసి ఖంగుమని వీధిలోకి దూకాడు ఆ బీడీలు కాల్చి చేంతాడుతో దెబ్బలుతిన్న మనుమడు.

మూడుగంటలదాకా కూర్చున్నాక వసుంధర నెమ్మదిగా గుహలోంచి బయటకు వచ్చినట్లు తిరిగి పిల్లాడిని చంకనేసుకుని యింటికి వచ్చేసింది. ఆమె లేత మనస్సు వికలమయిపోయి ఏ పనీ చకచకా చేయలేకపోయింది.

సాయంత్రం రామేశం వచ్చాడు. "ఏం అలాగున్నావ్?' అంటూ పరామర్శించాడు. కొంతసేపు చంటిపిల్లాడ్ని యెత్తుకొని ఆడించాక 'ఈ వూరు బాగులేదా? బెంగపెట్టుకున్నావా? అని గుచ్చిగుచ్చి అడిగాడు. వసుంధర నవ్వేసింది.

ఆ రాత్రే రామేశం వసుంధర పడుకొనబోతూండగా పొరుగు వారింట్లో పెద్దగలాటా అయితే చెవులురిక్కించి విన్నారు. వసుంధర ముఖం తెల్లగా పాలిపోయింది. రామేశం అన్నాడు : 'చూశావా ఆ పెద్ద కొడుకు చేయెత్తి తల్లిమీదకు కొట్టడానికి వస్తే కూతురు కాబోలు అడ్డుకుంది' అని. ఈ పాపపు రాత్రి పగిలి ముక్కలయిపోవలసిందే. ఉదయం కాళ్ళమీద వసుంధర పాపడ్ని పడుకోబెట్టుకుని స్నానానికి నూనె రాస్తూండగా రామేశమే అన్నాడు. 'రేపు నీ కొడుకూ అంతే పెరిగి పెద్దవాడయ్యాక-' పిల్లాడూ అమాయకంగా నవ్వుతున్నాడు, తల్లి కాళ్ళమీద కేరింతలు గొడుతూ, వసుంధర లోపల అనుకుంది, 'అవును నేను ఇవ్వాళే కళ్లువిప్పి లోకాన్ని చూస్తున్నాను' అని రామేశం నవ్వుతూ అన్నాడు.

"ఎప్పుడూ ఈ పిల్లల్ని నమ్ముకోమాక-" వసుంధరే సున్నిపిండి పిల్లాడికి పట్టిస్తూ 'ఏవిఁలోకం? ఏవిఁ మనుష్యులు-' అని పెదవి చప్పరించింది. పసిగ్రుడ్డు ఇంకా చేతుల్ని తడుతూ శూన్యంలోకి చూసి నవ్వుతున్నాడు.